క్లుప్తంగా

ఏపీఈఏపీ సెట్‌లో సత్యవాడ విద్యార్థి ప్రతిభ



ముద్రగడ త్రినాథ్

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు కాశీ అన్నపూర్ణ దంపతుల కుమారుడు ముద్రగడ త్రినాథ్ ఏపీఈఏపీ సెట్‌లో ప్రతిభ కనబరిచాడు. ఈ పరీక్షలో 440వ ర్యాంకు సాధించి అర్హత పొందాడు. త్రినాథ్ తండ్రి వెంకటేశ్వరరావు చిరు వ్యాపారి కావడం గమనార్హం. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు త్రినాథ్‌ను అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి



భూసార పరీక్ష పత్రాలను అందిస్తున్న శాస్త్రవేత్త రాజశేఖర్ తదితరులు

కె.గంగవరం: ప్రస్తుతం వరి సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతులు అందిపుచ్చుకుని సాగు చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని దంగేరు సొసైటీ వద్ద సోమవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతికత అందిపుచ్చుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన ఉండాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, భూసార పరీక్షలు, పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి పథకాలను గురించి రైతులకు ఆయన వివరించారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను ఆయన అందించారు. సంజయ్ హెగ్డే ఎస్‌ఎంఎస్ కలవచర్ల కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్, ఏఓ మనోహర్, ఉద్యాన వన అధికారి అనూష, మండల ఏవో బి.రవి, వ్యవసాయ సహాయకులు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులు అలవరచుకోవాలి

కపిలేశ్వరపురం: ఆధునిక సాగు పద్ధతులను ప్రతి రైతు అలవరచుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ శాఖ ద్వారా 2024-25 సంవత్సరానికి సంబంధించి మంజూరైన వ్యవసాయ పరికరాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే వేగుళ్ళ చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పవర్ టిల్లర్లు, రోటవేటర్లు, పవర్ స్ప్రేయర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.33,26,640 విలువైన పరికరాలను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, కూళ్ల ఈసీ చైర్మన్ మేకా శివప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వుల వీర వెంకట సత్యనారాయణ ప్రసాద్, నాయకులు పుత్సల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రవికుమార్ కుటుంబ సభ్యులకు పరామర్శ

కపిలేశ్వరపురం: వాకతిప్ప గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ గ్రామ బూత్ కమిటీ సభ్యుడు బొమ్మిత్తి రవికుమార్ ఇటీవల అకాల మృతి చెందాడు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు మేడిశెట్టి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, జిత్తుక వెంకటలక్ష్మి, నాయకులు గూటం సత్యనారాయణ, పాలింగి శ్రీనివాస్, పాలింగి కృష్ణ కిశోర్, మాతా నాగేశ్వరరావు, గెద్దాడ రామకృష్ణ సోమవారం వాకతిప్పలోని రవికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం



కపిలేశ్వరపురంలో విలేకరులతో మాట్లాడుతున్న జయరాజు

కపిలేశ్వరపురం: ఎమ్మార్పీఎస్‌ను రానున్న రోజుల్లో మరింత బలోపేతం చేస్తామని ఎంఎస్‌పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళి జయరాజు అన్నారు. కపిలేశ్వరపురంలో సోమవారం సంఘం స్థానిక నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మండల కమిటీల నియామకానికై నేడు మండపేట ఏడో వార్డులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు తాతపూడి రత్నకుమారి, మండలం ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కపిలేశ్వరపురం (మండపేట): ఏడిద సీతానగరంలో సోమవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ ప్రారంభించారు. సంస్థ కృషిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

తెరచుకోనున్న పాఠశాలలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 12న తరగతులు ప్రారంభం
- మండపేట నియోజకవర్గంలో 165 ప్రభుత్వ పాఠశాలలు
- రామచంద్రపురం నియోజకవర్గంలో 241 వైఎస్సార్ సీపీ హయాంలో మెరుగైన అభివృద్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అందంగా తీర్చిదిద్దిన వెదురుమూడి ప్రభుత్వ పాఠశాల

కపిలేశ్వరపురం: వేసవి సెలవులకు ఈ నెల 12తో స్వస్తి పలకనున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో పాఠశాల బాట పట్టే సమయం ఆసన్నమైంది. కొత్తగా పాఠశాలకు వెళ్తున్న చిన్నారులకు ఓ మధురానుభూతి కాగా పదో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు మాధ్యతతో కూడిన జీవన విధానం అవసరం అవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి చిన్నారులు అత్యధికంగా చదువుకుంటారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలను నాడు-నేడు పథకం పేరుతో విశేషంగా తీర్చిదిద్దింది. ప్రస్తుత కూటమి పాలనలో అవే పాఠశాలలు ఉపయోగపడ్డాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానాలతో మెరుగుపడిన ప్రభుత్వ విద్య

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు పేద, మధ్య తరగతి చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఊతమిచ్చాయి. అమ్మఒడి పథకం అమలుతో శ్రామిక మహిళలు తమ పిల్లలను పని మాన్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన అనుభవం గత ప్రభుత్వానిది. జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు విద్యా ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసింది. పాఠశాలలు తెరచే నాటికి వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో మండలాలకు విద్యాకానుకలుగా స్కూల్ బ్యాగ్, షూ, యూనిఫాం, బెల్ట్, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలను పంపిణీ చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్టూడెంట్ కిట్ పేరుతో విద్యా ఉపకరణాలను అందజేయక తప్పనిసరి అయింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 1-8 తరగతుల పాఠశాలను ఇంగ్లిష్ మీడియంలోకి మార్చారు. వారికి అందజేసే పాఠ్య పుస్తకాలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఉండేలా ముద్రించి పంపిణీ చేయడంతో పాఠ్యాంశాలను చిన్నారులు సులభంగా అర్థం చేసుకునేవారు.



ఏడాది కూటమి పాలనలో అసంపూర్తిగా నిలిచిన నల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం

కూటమి ప్రభుత్వం విధానాలు అస్పష్టం

కూటమి నేతలు గత ఎన్నికల సమయంలో విద్యారంగానికి సంబంధించి అనేక హామీలను ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడగానే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. కూటమి పాలనలో ఇప్పటికే ఒక విద్యా సంవత్సరం పూర్తయినా ఒక్క టీచర్ పోస్టూ భర్తీ కాలేదు. పేద కుటుంబాల్లో ఎంత మంది చిన్నారులు చదువుతుంటే అంతమందికీ రూ.20 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో ఆర్థిక సాయమందిస్తామన్నారు. ఒక్క రూపాయి ఇచ్చిందీ లేదు. మరో విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన రెండో విడత నాడు-నేడు పథకంలోని పనులను ఏడాది కూటమి ప్రభుత్వం పక్కన పెట్టింది. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇన్ని సమస్యల మధ్య 2025-26 విద్యా సంవత్సరం కూటమి పాలనలో ప్రారంభం కానుంది.

రెండు నియోజకవర్గాలలో ప్రభుత్వ పాఠశాలలిలా...

మండలం	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	మొత్తం
మండపేట పట్టణం	53	02	12	68
రాయవరం	33	05	08	46
కపిలేశ్వరపురం	37	06	08	51
ఆర్సీపురం పట్టణం	16	--	05	21
ఆర్సీపురం రూరల్	47	08	10	65
కె.గంగవరం	62	04	10	76
కాజులూరు	62	06	11	79
మొత్తం	310	31	64	406

'నాడు-నేడు' పథకంలో సుందరంగా పాఠశాలలు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్ల అమలు చేసిన నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు సుందరంగా తీర్చిదిద్దారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలతో పాటు ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన చేసేందుకు పరికరాలను అమర్చారు. రామచంద్రపురం అర్బన్, రూరల్‌లో రూ.10.32 కోట్లతో 65 పాఠశాలలను, కె.గంగవరం మండలంలో రూ.14.20 కోట్లుతో 49, కాజులూరు మండలంలో రూ.11.76 కోట్లతో 72 పాఠశాలలను ఆధునీకరించారు. రెండో విడత నాడు నేడు పనుల కోసం మండపేటలో 44 పాఠశాలలకు రూ.10.95 కోట్లు, రాయవరం మడలంలో 21 పాఠశాలలకు రూ.7.41 కోట్లు, కపిలేశ్వరపురం మడలంలో 32 పాఠశాలలకు రూ.8.35 కోట్లు మంజూరు కాగా పాఠశాలలను మెరుగుపర్చారు.

జనావాసాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తీసుకోవాలి



మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సాయిరాం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని జనావాసాల్లో మద్యం తాగుతున్న మందుబాబులపై తగిన చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ ఆదివారం రాత్రి పట్టణ పోలీసులకు వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం, రాజారత్నం సెంటర్, గొల్లపుంత కాలనీ రహదారిలో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారని, ఆయా ప్రదేశాలు వద్ద రహదారుల పైనా స్థానిక నివాసాలు అరుగులపైనా మద్యం తాగుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు మద్యం షాపులు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట14వ వార్డులో పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.19 లక్షల అంచనాతో నిర్మించిన బీసీ సామాజిక భవనం, 19వ వార్డులో రూ.43.87 లక్షలతో మౌలిక సదుపాయాలతో ఆధునీకరించిన డొక్కా సీతమ్మ మహిళా స్వశక్తి భవనాలను మంగళవారం ప్రారంభించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు సోమవారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని కమిషనర్ రంగారావు తెలిపారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

కాజులూరు: ప్రజావ్యతిరేక విధానాలతో అస్థిరపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని వైఎస్సార్ సీపీ నేత, తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి విమర్శించారు. సోమవారం గొల్లపాలెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ట్రాన్స్‌కో అధికారులు కనీవినీ ఎరుగని రీతిలో విద్యుత్‌కోత విధిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. వేసవి కారణంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో కుళాయిలకు తాగు నీరందక ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారని ఈ విషయంపై ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలతో రైతులకు పెట్టుబడులు రాక వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదన్నారు. ఎన్నికల్లో హామీలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించేందుకు రెడ్‌బుక్ పేరుతో ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. కూటమి పాలకుల నిరంకుశ ధోరణికి త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, యువజన విభాగం కార్యదర్శి నిమ్మితి విజయ్, పార్టీ నాయకులు దంగేటి వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి

రామచంద్రపురం: యువత పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు రావాలని, అందుకు అవసరమైన ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని విజయ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కోనసీమ స్టార్టప్ సమ్మిట్ పేరుతో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్, పరిశ్రమల స్థాపనపై జరిగిన అవగాహన సమావేశంలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు రుణాలు మంజూరు చేస్తుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఏడాదికి లక్ష 75 వేల మంది మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎలాంటి హామీ లేని రుణాలు రూ.లక్ష నుంచి కోటి వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. రామచంద్రపురం నియోజవర్గంతో పాటు కోనసీమ జిల్లా పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన పరిస్థితులు మెండుగా ఉన్నాయని జిల్లా యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా మారాలని పిలుపునిచ్చారు. సీడాప్, ఎమ్మెస్ ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్‌ల ద్వారా సూచనలు, సలహాలు అందించి, బ్యాంకు రుణ సదుపాయం పొందే వరకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అందజేస్తున్న ప్రత్యేక రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఎంఈ రాష్ట్ర చైర్మన్ శివశంకర్ మాట్లాడుతూ యువత వినూత్నంగా ఆలోచించి, జీవితంలో ఉన్నతంగా స్థిర పడేందుకు కృషి చేయాలన్నారు. సాధించగలననే పట్టుదల, ఆసక్తి ఉంటే అనుకున్నది సాధించగలరని ప్రోత్సహించారు. కోనసీమ జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగాన్ని నిర్మించాలనే పట్టుదలతో మంత్రి సుభాష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫ్లిప్‌కార్ట్ కంపెనీ డైరెక్టర్ డిప్పి వంకాని (ముంబై) మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అనువైన ప్రాంతమన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ మారుతి, సీడప్ జేడీఎం కిరణ్, పశుసంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ, చేనేత, జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవ వర్మ, మత్స్యశాఖ ఏడీ కృష్ణ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ అధికారులు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పి.ఆదినారాయణ, చిక్కాల దొరబాబు, పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు యువతీ యువకులు హాజరయ్యారు.

నేటి నుంచి పట్టణంలో ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం (మండపేట): నేటి నుంచి 13 వరకూ మొదటి విడతగానూ, 24 నుంచి 27 వరకూ రెండో విడతగానూ మండపేట పట్టణంలో ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు సంవత్సరాలు లోపు చిన్నారులకు బాల ఆధార్ నమోదు, 5 -15 వయస్సు గల బాల బాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియలను శిబిరాల్లో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ నవీకరణ ప్రక్రియ చేస్తారన్నారు. నేటి నుంచి 13 వరకూ కేపీ రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని 6వ వార్డు సచివాలయంలోనూ, సత్యశ్రీ రోడ్డులోని 14వ వార్డు సచివాలయంలోనూ నవీకరణ ప్రక్రియను చేస్తారన్నారు. రెండో విడతగా 24 నుంచి 27 వరకూ వల్లూరు వారి వీధిలోని కచేరి చావిడి సమీపంలోని 7వ వార్డు సచివాలయంలోనూ, గొల్లలగుంటలోని 1వ వార్డు సచివాలయంలోనూ నిర్దేశించిన డిజిటల్ అసిస్టెంట్లు నవీకరణ సేవలందిస్తారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి



ద్రాక్షారామ-యానం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రామచంద్రపురం రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన 5,400 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ద్రాక్షారామలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామ యానం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, అంగన్‌వాడీల సంఘం జిల్లా నాయకులు మేడిశెట్టి దుర్గమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు మలకా సుభాషిణి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 13 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు స్టీల్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రైవేటు కంపెనీల ఒత్తిడితో బీజేపీ ప్రభుత్వం వారిలో 5,400 మంది కార్మికులను తొలగించాలని 2024 సెప్టెంబరులో నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా దఫదఫాలుగా 4,000 మందిని ఇప్పటికే తొలగించారన్నారు. వీరికి కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, నష్టపరిహారం అందజేయకుండా తొలగించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీలు ప్లాంట్‌ను జైలుగా మార్చివేశారన్నారు. గత 40 సంవత్సరాల్లో స్టీలు ప్లాంట్‌లో పోలీసులను మోహరించడం ఇదే ప్రథమం అన్నారు. కార్మిక నాయకులను, కార్మికులను తీవ్రంగా బెదిరిస్తున్నారన్నారు. గత 30 ఏళ్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతంగా గనులు ఎందుకు కేటాయించలేదో పాలకులు చెప్పాలన్నారు. తొలగించిన 5,400 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ



మసకపల్లిలో ఇస్రాయేల్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణు తదితరులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లికి చెందిన భీమ్ సైనిక్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిశెట్టి ఇస్రాయేల్ తండ్రి వెంకట్రావు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకుని మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం ఇంటి వెళ్లి పరామర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పు దుర్గారమేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సాధికారత సమితి అధ్యక్షుడు పామర్తి జయప్రకాశ్, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు సోడదాసి రామ్, కె.గంగవరం మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పిల్లి కల్యాణ్ తదితరులు ఇస్రాయేల్‌ను పరామర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రసన్నాంజనేయస్వామి నగరోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసన్నాంజనేయ బాలభక్త కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనామ సప్త సప్తాహంలో భాగంగా మొదటి సప్తాహం(వారం రోజులు) పూర్తయిన సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ చేసిన ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ద్రాక్షారామ, వెలంపాలెం గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేశారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఐదుగురి ఎంపిక



మంత్రి నారాయణ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డును అందుకుంటున్న కాటాడి దీవెన

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు తణుకువాడ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పంపన కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాశాఖ షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక చేసిందన్నారు. ఇందులో తమ పాఠశాలకు చెందిన వాసంశెట్టి చరణ్ దీప్తి (585), కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వాసిరెడ్డి రామలక్ష్మి (583), శీల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మందపల్లి సూర్య తేజ (559), వింగ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కి చెందిన కాటాడి దీవెన (579), నవోదయ పాఠశాలకు చెందిన పెద్దిరెడ్డి రమ్య సాయిపూర్ణ పల్లవి (559) సాధించి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. వీరికి జిల్లా కేంద్రమైన కాకినాడలో జరిగిన సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ చేతుల మీదుగా రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారన్నారు. అవార్డు పొందిన విద్యార్థులను ఎంపీడీవో రాంబాబు, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, స్థానిక నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డులు సక్రమంగా నమోదు చేయాలి



ద్రాక్షారామ పీహెచ్‌సీలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దుర్గారావు దొర

రామచంద్రపురం రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సత్యనారాయణతో కలసి ద్రాక్షారామ పీహెచ్‌సీ కేంద్రాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లో భాగంగా పేషెంట్ వివరాలన్నీ ఆధార్ కార్డు నంబర్‌కి లింక్ అయిన ఫోన్ నంబర్‌తో ఓటీపీ నమోదు చేసి రిజిస్టర్ చేయాలని సూచించారు. పేషెంట్ స్క్రీనింగ్, ల్యాబ్ టెస్టులు, మందులు వంటి వివరాలన్నీ కూడా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉందన్నారు. గర్భిణి సేవల వివరాలను ఆర్సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పిల్లల టీకాల వివరాలను యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో భద్రపరచబడి ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సీహెచ్‌ఓ వీరవేణి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు గంగాధర్, శ్రీమన్నారాయణ, వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగా ప్రతి ఒక్కరి జీవన మార్గం



మండపేట పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, మున్సిపల్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): యోగా ప్రతి ఒక్కరి జీవన మార్గమని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, రాష్ట్ర నీటి పారుదల సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. పట్టణంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ ఆరోగ్య మార్గమైన యోగాపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, టీపీఓ రమ్య, మెప్మా సీఎంఎం పి.సుజాత, సీఓలు రాంజీ, ఎం.మహాలక్ష్మి, బి.వీరలక్ష్మి, ఆర్‌ఐ ఏజేఎస్ శ్రీనివాస్, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరంలో..

రాయవరం: మండలంలోని మాచవరంలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా అవసరమంటూ ఈ ర్యాలీ చేపట్టారు. ఈ నెల 21న దేశ వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో యోగాంధ్ర పేరిట నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. యోగాంధ్ర ర్యాలీలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి, స్థానిక నేతలు మేడపాటి రవీంద్రరెడ్డి, రిమ్మలపూడి సత్యనారాయణ, తీపర్తి శ్రీరమేష్, కోడి చినఅప్పారావు, గండి చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..



భీమేశ్వరాలయ ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న మంత్రి సుభాష్, జేసీ నిశాంతి

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం సోమవారం ఉదయం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రెండు గంటలు ఆలస్యంగా 8 గంటలకు ఆలయానికి చేరుకోవడంతో కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ తదితరులు యోగా శిక్షకుల సూచనల మేరకు ఆసనాలు వేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సెక్షన్‌లోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో ఉన్న పాడైన టవర్లు తొలగించి కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్న దష్ట్యా 33/11 కేవీ, 11 కేవీ లైను క్రాసింగ్ ఉండటం కారణంగా రామచంద్రపురం సెక్షన్‌లో 33 కేవీ తాళ్లరేవు ఫీడర్, 33 కేవీ రామచంద్రపురం టౌన్ ఫీడర్, 33 కేవీ గొల్లపాలెం ఫీడర్‌ల పై రామచంద్రపురం టౌన్‌లోను, ద్రాక్షారామ సెక్షన్‌లోని చోడవరం, నరసాపురపుపేట, ఓదూరు, యనమదల, రామచంద్రపురం మెయిన్ రోడ్డు, వీఎస్‌ఎం కళాశాల రోడ్డు, కమ్మవారిసావరం, శాంతినగర్, జల్లిపేట, పెద్దవంతెన సమీపంలోను ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

కాజులూరు: గ్రామాల్లో పంట పొలాల్లోకి వెళ్లే పుంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సోమవారం మండలంలోని పల్లిపాలెంలో మాజీ సర్పంచ్ మట్టపర్తి నాగలక్ష్మి, స్థానిక నాయకుడు మట్టపర్తి నారాయణమూర్తి తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గతంలో పుంత రోడ్లను అధికారులు ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి చేసేవారన్నారు. అయితే ప్రస్తుతం అధికారులు ఉపాధి పథకం ద్వారా తుప్పల తొలగింపు మినహా రైతులకు ఉపయోగపడే ఈ పుంత రోడ్లను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఇవి అధ్వానంగా తయ్యారై పొలాల్లో పంట ఉత్పత్తులను బయటకు తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం ద్వారా పుంత రోడ్లలో మెరక, పల్లాలు సరి చేసి గ్రావెల్ మట్టి వేయించాలని డిమాండ్ చేశారు.